## ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి

పరిగి, ఏప్రిల్ 23: ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం పరిగి పట్టణ శివారులో జరిగింది. ఎస్ఐ సంతోష్ అందించిన వివరాల ప్రకారం పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కావలి గోపాల్ పరిగి మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తారు. ఎప్పటివలె మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో కూరగాయలు తీసుకొని ఆటోలో పరిగికి వస్తుండగా పట్టణ శివారులోని ఓ పెట్రోల్‌బంక్ వద్ద డ్రైవర్ భాస్కర్ ఆటోను వేగంగా నడపడంతోపాటు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న గోపాల్‌కు బలమైన గాయాలు కావడంతో వెంటనే పరిగిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గోపాల్ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

## గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

పెద్దేముల్, ఏప్రిల్ 23 : ఐదో తరగతి ప్రవేశంలో భాగంగా తెలంగాణ గురుకుల సెట్–2024లో పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల నుంచి భాగ్యలక్ష్మి (తాండూరు బాలికల గురుకుల పాఠశాలకు), ఎన్. ప్రసాద్ ( తాండూరు బాలుర గురుకుల పాఠశాల ఎన్టీఆర్ కాలనీకు),బీ.యశ్వంత్ (పరిగి బాలుర గురుకుల పాఠశాలకు) ఎన్నికయ్యారు. గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జె.శ్రీనివాసులు సన్మానించారు.

# ఘనంగా హనుమాన్ జయంతి

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు
- వైభవంగా శోభాయాత్ర
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు


తాండూరు: హనుమాన్ శోభాయాత్ర


తాండూరు: హనుమాన్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నేతలు

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, ఏప్రిల్ 23 : హనుమాన్ జయంతిని మంగళవారం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. యువకులు, భక్తులు ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. తాండూరు పట్టణంలోని స్టేషన్‌హన్‌మాన్, రసూల్‌పూర్ హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, సుందరకాండ పారాయణం చేశారు. భజరంగ్‌దల్, హనుమాన్ మాలాధరణ సమితి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో రాత్రి నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్‌బీఓఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు పట్టణ ప్రముఖులు, యువకులు, హనుమాన్ భక్తులు హనుమాన్ శోభయాత్రలో పాల్గొన్నారు. ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరుగకుండా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. పరిగి పట్టణంలోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, భాస్కర్, వెంకటయ్య, శ్రీనివాస్, జగన్, వెంకటేశ్, రవికుమార్ పాల్గొన్నారు. సాయంత్రం పరిగి పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పూజలు నిర్వహించి శోభాయాత్రలో పాల్గొన్నారు. వికారాబాద్ బండ బావి హనుమాన్ దేవాలయం వద్ద స్వామివారి పల్లకీ సేవను భక్తులు నిర్వహించారు. వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో గ్రామ ఆలయ కమిటీ, భజన మండలి భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు కేఎస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ హాజరయ్యారు. తాండూరు మండంలోని చంద్రవంచ గ్రామంలోని శ్రీ హనుమాన్‌దేవాలయంలో మాజీ ఎంపీపీ శరణు బసప్ప, చారీ, మాజీ ఎంపీటీసీకొత్త నర్సయ్య గౌడ్, బాలేశ్వర్‌గౌడ్, గాండ్లసంగప్ప, పెన్నాకంపెనీప్రతినిధులు హాజరయ్యారు.


పరిగి: శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

## ఈ నెల 25 నుంచి ఓటర్ స్లిప్‌ల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వాసుచంద్ర

పరిగి, ఏప్రిల్ 23: ఈనెల 25వ తేదీ నుంచి ఓటర్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్స్ పంపిణీ చేపట్టనున్నట్లు వికారాబాద్ ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వాసుచంద్ర పేర్కొన్నారు. మంగళవారం వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశంతోపాటు తహసీల్దార్‌లు, సెక్టోరియల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వాసుచంద్ర మాట్లాడుతూ బీఎల్‌వోలు ఈనెల 25వ తేదీ నుంచి ఓటర్ స్లిప్స్ పంపిణీ చేపడతారన్నారు. 85 ఏండు పైబడిన ఓటర్లు ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకునే సదుపాయం సైతం కల్పించినట్లు తెలిపారు. సజావుగా ఎన్నికల నిర్వహణకు అందరు సహకరించాలని సూచిం చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాల్సిందిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ పార్టీల ప్రతినిధులు బూనేటి మారుతీ కిరణ్, ఆంజనేయులు, బేగ్, పీర్ మహ్మద్, ఆనందం పాల్గొన్నారు.

## నామినేషన్ దాఖలు కార్యక్రమానికి తరలిన నేతలు


కాసాని నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

పరిగి, ఏప్రిల్ 23 : చేవెళ్ల పార్లమెంటు స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నేతలు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నాయకత్వంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆర్.ఆంజనేయులు, ఎస్.భాస్కర్, జగన్, కౌన్సిలర్లు వారాల రవీంద్ర, నాగేశ్వర్, వెంకటేశ్ నాయకులు బి.రవి కుమార్, తాహెర్‌అలీ తదితరులు కార్యక్రమానికి తరలివెళ్లారు.

## ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, దళారులను నమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ఏ రకం ధాన్యానికి రూ.2203, బీ గ్రేడ్‌కు రూ 2183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ హమ్లానాయక్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# గూగుల్‌లో ఉద్యోగమంటూ.. రెండో పెండ్లికి సిద్ధమన్నాడు



**షాదీ.కామ్‌లో మహిళను పరిచయం చేసుకొని..**
**పెండ్లి పేరుతో రూ.1.8 కోట్లు కొట్టేశాడు**
**గ్లాస్ కట్టర్ నుంచి ఘరానా చీటర్‌గా ఎదిగిన నిందితుడు**
**అరెస్టు చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): జీవితాంతం నీతోనే ఉంటానంటూ ఓ మహిళను నమ్మించి రూ. 1.8 కోట్లు కొట్టేసిన ఘరానా మోసగాన్ని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు పెండ్లి పేరుతో చాలా మందిని నమ్మించి, డబ్బు కాజేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. పలువురు బాధితులు బయటకు చెప్పుకోలేక ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడినట్టు విచారణలో తేలింది. సైబర్‌క్రైమ్స్ ఏసీపీ రవీందర్‌రెడ్డి ఈ కేసు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లాకు చెందిన కొమినేని వంశీ చౌదరి హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న వెంకటాద్రి రెసిడెన్సీలో ఉంటున్నాడు. డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేసి.. 2009లో బెంగళూర్‌కు వెళ్లాడు. అక్కడ ప్లైవుడ్ షాప్‌లో గ్లాస్ కట్టర్‌గా చేరాడు. ఆ దుకాణం పక్కనే జాబ్ కన్సల్టెన్సీ కార్యాలయం ఉంది. అక్కడికి వచ్చిపోయే వారితో మాట్లాడుతూ.. ఎక్కడక్కెడ ఉద్యోగాలు ఉంటాయి, ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి.. అని విషయాలను అడిగి తెలుసుకున్నాడు. అక్కడి నుంచే మోసాలు చేయడం ప్రారంభించాడు. పెండ్లి చేసుకుంటానని మహిళలను నమ్మించి అందిన కాడికి దోచుకోవడం మొదలు పెట్టాడు. మహిళల నుంచి దోచుకున్న సొమ్ముతో విలాస వంతమైన జీవితాన్ని గడుపుతూ, ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే షాది.కామ్‌లో తన ప్రొఫైల్‌ను అప్‌లోడ్ చేశాడు. తాను విడాకులు తీసుకున్నానంటూ తన ప్రొఫైల్‌లో పొందుపరిచాడు. రెండో పెండ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నానంటూ పేర్కొన్నాడు. అంతేకాదు.. తాను అమెరికాలోని గూగుల్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు సూచించాడు. గూగుల్ పేరుతో ఓ నకిలీ ఐడీ కార్డు, ఇండియన్ కస్టమ్స్‌కు సంబంధించిన ఫేక్ స్టాంపులతో సర్టిఫికెట్లు కూడా తయారు చేసి, పలువురిని నమ్మించాడు. ఇదిలా ఉండగా.. బాధితురాలి భర్త 2008లో అనారోగ్యంతో చనిపోయాడు. ఆమె అమెరికా, ఇంగ్లాండ్‌లో ఉద్యోగాలు చేసింది. ఆమె ఇంట్లో రెండో పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో తన ప్రొఫైల్‌ను 2018లో షాది.కామ్‌లో అప్‌లోడ్ చేసింది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. బాధితురాలి ప్రొఫైల్‌ను చూసిన వంశీ చౌదరి, ఆమెను పెండ్లి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నానంటూ మెసేజ్ పెట్టాడు. ఆమెను మోసం చేసేందుకు ప్రత్యేకంగా రెండు ఈ మెయిల్ ఐడీలు, అమెరికా, లండన్ నంబర్లను రూ.1,610 చొప్పున మూడు కొనుగోలు చేసి, ఆ నంబర్లతోనే అమెరికాలో ఉన్నట్లు బాధితురాలిని నమ్మించేందుకు మెసేజ్ పంపించాడు. పెండ్లి చేసుకున్న తరువాత కూడా అమెరికాకు వస్తానంటేనే పెండ్లి చేసుకుంటానంటూ వంశీ చౌదరి షరతు కూడా విధించాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు పెండ్లికి ఒప్పుకున్నారు. కొద్ది రోజుల తర్వాత తాను అమెరికా నుంచి వస్తున్నాను.. అని చెప్పి.. ఓ రోజు బాధితురాలికి ఇంటికి వెళ్లాడు. తన మాయమాటలతో బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను నమ్మించి ఒప్పించాడు. కొద్ది రోజుల తర్వాత ఈ పెండ్లికి తన కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంలేదని, నాకు వారు అవసరం లేదు.. నీతోనే నా పెండ్లి అంటూ నమ్మించాడు. అంతేగాక.. ఇష్టం లేని పెండ్లి చేసుకుంటున్నానంటూ నా కుటుంబ సభ్యులు తన మొత్తం బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని, ఆర్థికంగా సహకరించాలని, అమెరికా వెళ్లిన తర్వాత మొత్తం డబ్బు తిరిగి ఇస్తానంటూ నమ్మించి, బాధితురాలి కుటుంబం నుంచి రూ.1.8 కోట్లు కాజేశాడు. కరోనా సమయంలో బాధితురాలి కూతురు ఆస్పత్రిలో చేరగా.. ఆస్పత్రి ఖర్చుల కోసం కొంత డబ్బు ఇవ్వాలని కోరగా.. చేతులెత్తాశాడు. చిన్నారి మరణించింది. ఆ తర్వాత నిందితుడు కనిపించకుండా పోయాడు. ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు.. అతడిని వెతకడం మొదలుపెట్టింది. ఎక్కడా అతడి ఆచూకీ తెలియకపోవడంతో సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన ఏసీపీ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేశ్ బృందం.. నిందితుడిని అరెస్టు చేసింది. అతడి వద్ద నుంచి ఫోన్లు, కస్టమ్స్ అధికారులకు సంబంధించిన నకిలీ రబ్బర్ స్టాంపులు, గూగుల్, కస్టమ్స్‌కు చెందిన నకిలీ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

## సీబీఐ పేరుతో వైద్యురాలికి బెదిరింపు

**రూ.48 లక్షలు కాజేసిన సైబర్‌నేరగాళ్లు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఫెడెక్స్ కొరియర్‌లో మీ పేరుతో మలేషియా నుంచి ఢిల్లీకి డ్రగ్స్ వచ్చాయంటూ.. వైద్యురాలిని బెదిరించిన సైబర్‌నేరగాళ్లు రూ.48 లక్షలు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితురాలికి.. తాను సీబీఐ కానిస్టేబుల్‌నంటూ ఒక మహిళా వీడియో కాల్ చేసింది. దీంతో పాటు బాధితురాలి వాట్సాప్‌కు సీబీఐ నుంచి అరెస్టు వారెంట్ కాపీ అంటూ ఓ పత్రాన్ని పంపింది. వీడియో కాల్, వారెంట్ కాపీ చూసిన బాధితురాలు ఆందోళనకు గురైంది. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నీవు కాల్ డిస్‌కనెక్ట్ చేయవద్దు.. కాల్ డిస్‌కనెక్ట్ చేస్తే హైదరాబాద్‌లోని మీ ఇంటికి పోలీసులు వచ్చి అరెస్టు చేస్తారు.. అంటూ బెదిరించింది. బాధితురాలితో రెండు గంటల పాటు మాట్లాడింది. ఆ తర్వాత బ్యాంకు ఖాతా గురించి ప్రస్తావించి, డబ్బులు డిపాజిట్ చేయించుకున్నారు. కేసు విచారణ తర్వాత డబ్బుంతా తిరిగి వస్తుందని నమ్మించింది. బాధితురాలి ఖాతాల నుంచి రూ.48 లక్ష లు (ఫిక్సుడ్ డిపాజిట్లు) నిందితులు తమ ఖాతాల్లోకి మార్చుకున్నారు. ఇదంతా మోసమని గ్రహించిన బాధితురాలు సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు దర్యాప్తు చేపట్టారు.

## మ్యాన్‌హోల్‌లో శిశువు మృతదేహం

బంజారాహిల్స్, ఏప్రిల్ 23: బంజారాహిల్స్‌లో ఓ మ్యాన్‌హోల్‌లో మృతశిశువు కలకలం సృష్టించింది. బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని వెంకటేశ్వరనగర్‌లో మంగళవారం జలమండలి ఆధ్వర్యంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఆ సమయంలో ఓ మ్యాన్‌హోల్ నుంచి తీసిన వ్యర్థాల్లో శిశువు మృతదేహం బయటపడింది. అనారోగ్యంతో చనిపోయిన శిశువును ఎవరైనా మ్యాన్‌హోల్‌లో పారవేశారా..! లేక గర్భస్రావం జరగడంతో డ్రైనేజీ ద్వారా కొట్టుకువచ్చిందా..! అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## విధుల్లో నిర్లక్ష్యం..

**నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తూ ఇటీవల జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్‌రాస్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఆయా కారణాలతో నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సెలవుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరి లీవ్‌లు అప్రూవల్ కాకముందే.. విధులకు డుమ్మా కొట్టారు. ఈ మేరకు నలుగురిపై సస్పెండ్ వేటు వేస్తూ రోనాల్డ్‌రాస్ ఆదేశాలు జారీ చేశారు. మెహిదీపట్నం, బేగంపేటకు సంబంధించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మౌళిక, గోషామహల్‌కు చెందిన రాకేశ్, మూసాపేటలో నిహారిక, జూబ్లీహిల్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న సౌమ్యపై చర్య లు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**PUBLIC NOTICE**

The General public are hereby informed that our client Sri.Donthula Naresh Kumar S/o.Donthula Ravi, R/o.Yesdeep Homes, Road No.2, Kothapet, RK Puram, Opp:HDFC Bank, Saroornagar, R.R.District., intends to purchase **Plot bearing No.479 in Survey No.94, admeasuring 247 Sq.Yards or 206.51 Sy.Meters situated at Injapur Village, Hayathnagar Mandal, R.R. District.,** from its lawful owner Smt. Rangu Jayaprada, W/o.Late Ranga Ramulu, door No. B-5-545/5/A2, First Floor, Lakshminagar, Kothirampur, Karimnagar, who having purchased the same from its lawful owners Shaga Jangaiah &36 others through their GPA Holders N.Gopala Krishna and another through a registered Sale Deed Document No.10951/1992 08-10-1992 Registered at S.RO. Hayathnagar., and further intending to transfer of said property in due course. Therefore, the general public are hereby informed that if any person/persons having any claim/ objection whatsoever in respect of the above said purchase of property i.e., **Plot bearing No.479 in Survey No.94, admeasuring 247 Sq.Yards or 206.51 Sy.Meters situated at Injapur Village, Hayathnagar Mandal, R.R.District.,** may put forth the same with the undersigned within Seven (7) days from the date of this publication along with documentary proof. If no claims are received, our clients shall proceed with the sale transaction/sale deed and no claims shall be entertained thereafter.

Sd/- **E.AMARENDER,** Advocate
O/o.2-3-692/1/D/68/B, Durga Nagar, Amberpet, Hyderabad- 013. Cell No.9395559899, 9700575500

## నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

- వసతి గృహాల నుంచి ఇంటిబాట పట్టిన విద్యార్థులు
- జూన్ 12న పాఠశాలలు రీ ఓపెన్

బొంరాస్‌పేట, ఏప్రిల్ 23 : 2023–24 విద్యా సంవత్సరం ఏప్రిల్ 23 మంగళవారంతో ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులను ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ నెల 15 నుంచి 22 వరకు 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మెటివ్–2 పరీక్షలు నిర్వహించి సబ్జెక్టులవారీగా మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులు సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. విద్యా సంవత్సరం చివరి పనిదినమైన మంగళవారం పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించిన ఉపాధ్యాయులు ఫలితాలను ప్రకటించి విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి పత్రాలను అందజేశారు. పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో వసతి గృహాలు, ప్రైవేటు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు మంగళవారం ఇంటిబాట పట్టారు.


పెద్దఅంబర్‌పేట : తట్టిఅన్నారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

### సర్కారు స్కూళ్లలో సందడి

పెద్దఅంబర్‌పేట : ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం చివరి పనిదినం కావడంతో సందడి నెలకొన్నది. బుధవారం నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు.



బొంరాస్‌పేట : ఆన్‌లైన్ ప్రగతిపత్రాలతో చెట్టుపల్లితండా కేజీబీవీ విద్యార్థినులు

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం..



కులకచర్ల, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ సందని గడ్డ ప్రాథమిక పాఠ శాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయులు సంతోశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులచే సాస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

### రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



మర్పల్లి, ఏప్రిల్ 23: మర్పల్లి మండల రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడిగా కె. మోహన్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో మండలంలోని రేషన్ డీలర్లు అందరూ సమావేశమై అధ్యక్షుడిగా మోహన్‌ను, ఉపాధ్యక్షురాలిగా కవితను, కార్యదర్శిగా పర మేశ్వర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి సన్మానం చేశారు.

## ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలి



కులకచర్ల, ఏప్రిల్ 23 : అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లాపూర్, రాం రెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో పనులను పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన మండల మహిళా సమాఖ్య సమా వేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతి పాఠశాలలో నిర్ణయించిన మేరకు పనులు పూర్తి చేసేం దుకు చైర్‌పర్సన్లు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు, మైనర్, మేజర్ రిపేర్‌వర్కులు పాఠశాలల్లో చేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి కమిటి కృషిచేయాలని అన్నారు. దీనికి సంబంధించిన డబ్బులు త్వరగానే వస్తా యని పనులు పూర్తి చేయాలని గ్రామ సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్య క్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అలవేణి, ఏపీఎం శోభ, మండల మహిళా సామాఖ్య ప్రతినిధులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో జీవితఖైదు

నాంపల్లి కోర్టులు/మెహిదీపట్నం, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : లంగర్‌హౌజ్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన లైంగిక దాడి కేసులో అతీఖ్‌ఖాన్ (29)కు జీవితఖైదుగా నాంపల్లి ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి టి.అనిత మంగళవారం తీర్పు వెల్లడించారు. సహజమరణం పొందేంత వరకు జీవితఖైదుగా శిక్షను అనుభవించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.రాంరెడ్డి కథనం ప్రకారం.. లంగర్‌హౌజ్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న ముద్దాయి.. 2021లో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు కోర్టు ఎదుట సాక్షులు తెలిపిన వాంగ్మూలాల ఆధారంగా నిందితుడిపై నేరం రుజువైంది. నిందితుడికి శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలల పాటు జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని వివరించారు.

## పెళ్లికి ముందు వధువు అదృశ్యం

వెంగళరావునగర్, ఏప్రిల్ 23 : పెళ్లికి ఐదు రోజుల ముందు వధువు అదృశ్యమైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ కార్మికనగర్‌లో నివాసముండే అన్షు కుమార్ మాదాపూర్‌లో ఫిజియోథెరిపిస్ట్‌గా పనిచేస్తుంటాడు. వరంగల్ శ్యాంపేటకు చెందిన బ్యాచ్‌మెట్ సంధ్య, అన్షుకుమార్ ఏడేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 26న ఇరుపక్షాల పెద్దల అంగీకారంతో పెళ్లి ఏర్పాట్లు చేశారు. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు సంధ్యతో కలిసి వచ్చి.. కార్మికనగర్‌లోని అన్షు గదిలోనే ఉంటున్నారు. ఈ నెల 22వ తేదీన డ్యూటీకి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో సంధ్య కనిపించలేదు. తనకు కాబోయే భార్య సంధ్య అదృశ్యంపై బాధితుడు అన్షుకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవి విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు: 80966 77657